


EVENING EDITION


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
20 జూన్ 2024
పేజీలు: 02



చనిపోయిన హజ్ యాత్రికుల్లో
# 90 మంది భారతీయులు?

తీవ్ర ఎండ, వేడిగాలులతో ఈ ఏడాది హజ్ యాత్రికులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 650మంది వరకు మరణించి ఉంటారని అధికారిక వర్గాలు అంచనా వేశాయి. వీరిలో దాదాపు 90 మంది భారతీయులు ఉన్నట్లు ఓ దౌత్యాధికారిని ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనిపై అటు సౌదీగానీ, ఇటు భారత ప్రభుత్వంగానీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయిదు రోజుల హజ్ యాత్రలో కనీసం 650 మంది మృతి చెందినట్లు అక్కడి వైద్యాధికారులు ధ్రువీకరించారు. యాత్రికుల మరణాల మొత్తం సంఖ్యపై ప్రభుత్వపరంగా ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. జోర్డాన్, టునీసియా వంటి కొన్ని దేశాలు తమ యాత్రికుల మరణాలను ధ్రువీకరిస్తూ ప్రకటనలు చేశాయి. అత్యధికంగా ఈజిప్టుకు చెందిన 320 మంది యాత్రికులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ ఏడాది మొత్తం 18.3 లక్షలమంది హజ్ యాత్ర పూర్తి చేసుకున్నారు. ఇందులో 22 దేశాలకు చెందిన యాత్రికులు 16 లక్షల మంది ఉండగా, సౌదీ పౌరులు రెండు లక్షల మందికి పైగా ఉంటారని సౌదీ హజ్ అధికార యంత్రాంగం తెలిపింది.



సతీమణికి సీఎం చంద్రబాబు
# బర్త్ డే విషెస్

సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నేడు పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఆమెకు బర్త్ డే విషెస్ తెలుపుతూ చంద్రబాబు ట్వీట్ చేశారు. 'ప్రజా సేవకు అంకితమైన నాకు ఎల్లవేళలా అండగా నిలిచావు. కష్ట సమయాల్లోనూ చిరునవ్వు చెదరకుండా ధైర్యంగా నాకు తోడుగా ఉన్నావు. హ్యాపీ బర్త్ డే భువనేశ్వరి. నా సర్వస్వం' అని పోస్ట్ చేశారు.

ప్రజావేదిక శిథిలాలను పరిశీలించిన
# ఏపీ సీఎం చంద్రబాబు



వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపుతో నిర్లక్ష్యానికి గురైన పలు నిర్మాణాలు, రాజధాని ప్రాంత స్థితిగతుల్ని ఏపీ సీఎం చంద్రబాబు తెలుసుకుంటున్నారు. అమరావతి నిర్మాణాల పరిశీలనలో భాగంగా ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరారు. తొలుత ప్రజావేదిక శిథిలాలను సీఎం పరిశీలించారు. అనంతరం ఉద్దండరాయునిపాలెం బయల్దేరారు. అక్కడ ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్, అసంపూర్తిగా మిగిలిన అఖిల భారత సర్వీసు అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాల్ని పరిశీలిస్తారు. ఐకానిక్ నిర్మాణాల కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు మొదలుపెట్టిన ప్రాంతాలకు వెళతారు. పర్యటన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడనున్నారు.అమరావతి పర్యటనకు బయల్దేరిన సీఎం చంద్రబాబు. ఉండవల్లిలో జగన్ రెడ్డి కూలగొట్టిన ప్రజావేదిక ప్రాంతాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు గారు. జగన్ విధ్వంస మనస్తత్వానికి శిథిల సాక్ష్యం ఈ ప్రజావేదిక. 5 ఏళ్ళ నుంచి ప్రజా వేదిక వ్యర్థాలు కూడా తీయకుండా, అక్కడే ఉంచి పైశాచిక ఆనందం పొందిన జగన్. జగన్ విధ్వంస పాలనకు ప్రతీక ప్రజావేదిక అని, ఆ శిథిలాలను తొలగించం అని ఇప్పటికే ప్రకటించిన సియం చంద్రబాబు గారు.


# ఆఫ్ఘనిస్తాన్ vs ఇండియా

## టీమిండియా ప్లేయింగ్ 11లో రెండు మార్పులు




టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 మ్యాచ్ ఆడేందుకు టీమిండియా సోమవారం వెస్టిండీస్‌లోని బార్బడోస్ చేరుకుంది. జూన్ 20న ఆఫ్ఘనిస్థాన్‌తో భారత్ తలపడనుంది. ఫ్లోరిడాలో వర్షం కారణంగా గ్రూప్ దశలో చివరి మ్యాచ్ రద్దయింది. అంతకుముందు గ్రూప్‌లో అమెరికా, పాకిస్థాన్, ఐర్లాండ్‌లను టీమిండియా ఓడించింది.అమెరికా డ్రాప్‌ఇన్ పిచ్‌పై భారత్ ఇప్పటి వరకు టీ20 ప్రపంచకప్‌లో 3 మ్యాచ్‌లు ఆడింది. అదే సమయంలో, ఇప్పుడు సూపర్-8 మ్యాచ్‌లు వెస్టిండీస్‌లోని 6 మైదానాల్లో జరగనున్నాయి. IPL 2024లో 200 పరుగులు చేయడం సర్వసాధారణం. కానీ, ఇప్పటివరకు వెస్టిండీస్ పిచ్‌లలో 200 పరుగులు కేవలం రెండుసార్లు మాత్రమే నమోదయ్యాయి. ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌లు 200 పరుగులు చేశాయి. సూపర్-8లోని 8 జట్లలో కేవలం నాలుగు జట్లు మాత్రమే ఇక్కడ మొత్తం 150కి పైగా పరుగులు సాధించాయి. సూపర్-8 మ్యాచ్‌ల కోసం టీమిండియా ఆటగాళ్లు సన్నాహాలు ప్రారంభించారు. ఈ సమయంలో నెట్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ పిచ్ ఎలా ఉందని జస్ప్రీత్ బుమ్రాను అడిగాడు. అదే సమయంలో, ప్రాక్టీస్ పిచ్‌పై బుమ్రా ఆనందంగా కనిపించాడు. పిచ్ పరిస్థితులను పరిశీలిస్తే, భారత్ తన ప్లేయింగ్ 11లో మార్పులు చేయగలదు. ఆఫ్ఘనిస్తాన్ తన 4 మ్యాచ్‌లలో 3 గెలిచి సూపర్-8కి అర్హత సాధించింది. అయితే, మంగళవారం వెస్టిండీస్‌తో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్థానంలో భారత జట్టు కుల్దీప్‌ను ఆడించవచ్చు. వెస్టిండీస్ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలిస్తాయి. ఇటువంటి పరిస్థితిలో, చైనామన్ కుల్దీప్ యాదవ్ ప్రాణాంతకం అని నిరూపించవచ్చు. ఇక్కడ గత 3 మ్యాచ్‌ల్లో రవీంద్ర జడేజా రాణించలేకపోయాడు. జడేజా బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ ప్రభావవంతంగా కనిపించలేదు. అందువల్ల రవీంద్ర జడేజాను దూరంగా ఉంచవచ్చు.






ముద్రగడ
# పేరు మారింది

మాజీ మంత్రి, కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభం పేరు మారింది. తాజాగా ఆయన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మారుస్తూ ఏపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలిస్తే తన పేరు మార్చుకుంటానని ఎన్నికలకు ముందు ముద్రగడ సవాల్ విసిరారు. మాట ప్రకారం తాజాగా పేరు మార్చుకున్నారు.

నష్టాల్లో
# స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ సూచీలు గురువారం ఆరంభంలో నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 118 పాయింట్లు కుంగి 77,218 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 35 పాయింట్లు నష్టపోయి 23,480 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.43 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, రిలయన్స్, మారుతీ, విప్రో, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.



105 ఏళ్ల బామ్మ
# మాస్టర్స్ డిగ్రీ

మధ్యలో వదిలేసిన చదువును పూర్తి చేయడం సామాన్య విషయం కాదు. అందుకు చాలా పట్టుదల కావాలి. పెళ్లి పిల్లలు తరువాత, పెళ్లికి ముందు వదిలివేసిన డిగ్రీ, లేదా ఇతర చదువు పూర్తి చేయమంటే.. ఇపుడేం చదువులే.. అని పెదవి విరుస్తారు చాలామంది. కానీ 105 ఏళ్ల బామ్మ ఏకంగా మాస్టర్స్ డిగ్రీ పట్టా పుచ్చుకుంది. చాలామందికి డిగ్రీ పట్టా పుచుకోవడం ఒక కలగా మిగిలిపోతుంది. కానీ 83 ఏళ్లక్రితం మిస్ అయిన స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ మాస్టర్స్ డిగ్రీని తాజాగా 105 ఏళ్ల వయసులో అందుకుంది. వర్జీనియా "జింజర్" హిస్లాప్ తాజాగా ఈ డిగ్రీని అందుకుంది. దీని కోసం ఎంతో కాలంగా వేచి ఉన్నానంటూ ఆమో భావోద్వేగానికి లోనైంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
# ఇంట్లో ఈడీ సోదాలు




తెలంగాణలో మరోసారి ఈడీ సోదాల అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో, తీవ్ర కలకలం చోటుచేసుకుంది. కాగా, ఈడీ అధికారులు ఏక కాలంలో గురువారం తెల్లవారుజాము నుంచే పటాన్‌చెరు నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టారు. అలాగే, ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇద్దరు సోదరులు మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలి కాలంలో ఓ కేసులో గూడెం మధు అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. నిజాంపేటలోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లో కూడా అధికారులు సోదాలు చేస్తున్నారు. ఇక, గతంలో లక్డారం గనుల వ్యవహారంలో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక, తాజా సోదాల గురించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

కల్తీసార ఘటనలో 34కు చేరిన మృతులు..
## 10 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించిన స్టాలిన్



తమిళనాడు కల్తీ సార ఘటనలో మృతుల సంఖ్య గంటగంటకు పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ ప్రమాదంలో చనిపోయిన వారి సంఖ్య 34 కు చేరింది. పలు ఆస్పత్రిల్లో ఇంకా 60 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామంది హెల్త్ కండిషన్ సీరియస్ గా ఉందని అంటున్నారు అధికారులు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులు హాస్పిటళ్ల దగ్గర కన్నీరుమున్నీరవుతున్నారు. కల్తీ మద్యం ఘటనపై సీరియస్ గా స్పందించింది స్టాలిన్ సర్కార్. ఇంతమంది చనిపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు తమిళనాడు . ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేశామని ట్వీట్ చేశారు. మృతుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, చికిత్స పొందుతున్న వారికి రూ.50 వేల చొప్పున ప్రకటించారు. మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి గోకుల్‌దాస్‌తో కూడిన వన్ మ్యాన్ కమిషన్ ఈ అంశంపై విచారణ జరిపి మూడు నెలల్లో నివేదికలు సమర్పించాలని ప్రకటించింది. తమిళనాడులోని కల్లకురిచి జిల్లా కరుణాపురంలో జూన్ 19న రాత్రి కల్తీ మద్యం తాగడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరంతా సేలం, పుదుచ్చేరి, విల్లుపురంలోని హాస్పిటల్స్ లో చికిత్స పొందుతున్నారు. ట్రీట్మెంట్ పొందుతున్న వారిని పరామర్శించారు.



5 ఎకరాలకు మాత్రమే
# రైతుభరోసా?

రైతుభరోసా (ఇదివరకు రైతుబంధు) మార్గదర్శకాలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గుట్టలు, కొండలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతుభరోసా ఇవ్వొద్దని డిసైడ్ అయినట్లు సమాచారం. సాగు చేసే రైతుకు మాత్రమే పెట్టుబడి సాయం దక్కాలనేది ప్రభుత్వ ఉద్దేశమని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా.. ఒక రైతుకు 5 ఎకరాలకు మాత్రమే రైతుభరోసా పరిమితం చేయనున్నట్లు తెలుస్తోంది.

## గ్రూప్2 మెయిన్స్ వాయిదా వేయాలని విజ్ఞప్తి

పోలీసు ఉద్యోగాల భర్తీకి మెగా పోలీస్ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రూప్-2 మెయిన్స్ 2నెలలు వాయిదా వేయాలని కోరారు. ఎన్నికల దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సిలబస్ ఎక్కువగా ఉందని వివరించారు. డిప్యూటీ డీఈఓ మెయిన్స్‌కు 1:100 విధానంలో అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు.



# ట్యాబ్లెట్ల ధరలు పెంపు

డయాబెటిస్, బీపీ సహా 54 రకాల ఔషధాల ధరలను కేంద్రప్రభుత్వం పెంచింది. మధుమేహం రోగులు అధికంగా వినియోగించే మెట్‌ఫార్మిన్, లినాగ్లిప్టిన్, సిటాగ్లిప్టిన్ రేట్లను ట్యాబ్లెట్‌కు రూ.15 నుంచి రూ.20కు పెంచింది. బీపీకి వినియోగించే టెల్మిసార్టన్, క్లోర్థాలిడన్, సిల్ని డిపైన్ మందుల ధరను రూ.7.14గా సవరించింది. యాంటీ బ్యాక్టీరియల్ ఇంజెక్షన్ సిప్రోఫ్లోక్సాసిన్, కాల్షియం, విటమిన్ డీ3 పిల్స్ రేట్లు సైతం పెరిగాయి.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



## బాలీవుడ్ స్టార్‌సన్నీ డియోల్‌తో గోపీచంద్ భారీ ప్రాజెక్ట్ అప్డేట్

ప్రస్తుతం మన టాలీవుడ్ లో వరుస హిట్స్ తో అదరగొడుతున్న మాస్ స్టార్ దర్శకుల్లో గోపీచంద్ మలినేని కూడా ఒకరు. క్రాక్, వీరసింహా రెడ్డి సినిమాలతో అదరగొట్టిన ఈ దర్శకుడు నెక్స్ట్ కూడా మాస్ మహారాజ రవితేజతో సినిమా చేయాల్సి ఉంది. అయితే ఇది అఫీషియల్ గా అనౌన్స్ అయినప్పటికీ కొన్ని కారణాలు చేత నిలిచిపోయింది. మరి ఈ తర్వాత బాలీవుడ్ స్టార్ హీరో సన్నీ డియోల్తో సినిమా చేస్తున్నారని కొన్ని రూమర్స్ వచ్చాయి. అయితే ఇది దాదాపు ఖరారే కానీ ఇపుడు ఈ క్రేజీ కాంబినేషన్ పై అఫీషియల్ అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమాని నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ వారు అఫీషియల్ గా అనౌన్స్ చేసేసారు. దేశంలోనే బిగ్గెస్ట్ యాక్షన్ సినిమా అంటూ తమ సినిమాని సన్నీ డియోల్ తో మేకర్స్ అనౌన్స్ చేశారు. మరి షూటింగ్ అతి త్వరలోనే మొదలు పెట్టుకోనున్న ఈ చిత్రం మాస్ ఫీస్ట్ అందించబోతుంది అని ఎగ్జైటింగ్ అప్డేట్ ని అందించారు. అలాగే ఈ చిత్రానికి కూడా థమన్ సంగీతం అందిస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. మొత్తానికి అయితే ఇండియన్ సినిమా దగ్గర మరో క్రేజీ కాంబినేషన్ అని చెప్పాలి.

## యూఎస్ మార్కెట్ లో "కల్కి" బుకింగ్స్ విధ్వంసం

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు, తెలుగు వారు ఆసక్తిగా ఎదురు చూస్తున్న అవైటెడ్ చిత్రం ఏదన్నా ఉంది అంటే అది "కల్కి 2898 ఎడి" అని చెప్పాలి. రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ చేసిన ఈ సినిమా మన టాలీవుడ్ నుంచి అయితే మరో పాత్ బ్రేకింగ్ సినిమాగా మారింది. ఊహించని ఎలిమెంట్స్ తో ప్లాన్ చేసిన ఈ సినిమా యూఎస్ మార్కెట్ లో దుమ్ము లేపుతుంది. అక్కడ ఆల్రెడీ భారీ బుకింగ్స్ ప్రీ సేల్స్ ని నమోదు చేస్తున్న ఈ చిత్రం లేటెస్ట్ గా 55 వేల 555 టికెట్స్ అమ్ముడుపోయి సెన్సేషనల్ రెస్పాన్స్ ని అందుకుంది. దీని బట్టి యూఎస్ ఆడియెన్స్ లో కల్కి పట్ల ఉన్న అంచనాలు ఏ లెవెల్లో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.





### తెలంగాణలో 10 వేల మంది టీచర్లకు

# ప్రమోషన్ ఆర్డర్లు

రాష్ట్రంలోని మల్టీజోన్ 1 పరిధిలో ఏకంగా 10 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు లభించాయి. ప్రమోషన్లు పొందిన టీచర్లు బుధవారం.. వారికి కేటాయించిన స్కూళ్లలో జాయిన్ అయ్యారు. దీంతో చాలా బడుల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీరినట్లు అయింది. టీచర్ల ప్రమోషన్లపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు మీడియాలో వార్తల నేపథ్యంలో టీచర్లలో అయోమయం నెలకొనగా, ప్రమోషన్ ఆర్డర్లు అందడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. టీచర్ల ప్రమోషన్లకు టెట్ క్వాలిఫై తప్పనిసరి అనే ఎన్‌సీటీఈ నిబంధనతో గతంలో మధ్యలో ఆగిపోయిన ప్రమోషన్ల ప్రక్రియ.. ఆ తర్వాత హైకోర్టు ఆదేశాలతో ఈనెల 8 నుంచి తిరిగి ప్రారంభమైంది. మల్టీజోన్ 1లో ఈ నెల 12న ఎస్జీటీ, దాని సమానమైన క్యాడర్ సీనియారిటీ లిస్టులను రిలీజ్ చేయగా, ఆ తర్వాత వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కొనసాగించారు. ఈ నెల 17న ప్రమోషన్, పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉంది. అయితే, మంగళవారం ఆర్డర్లు జారీచేసినా.. మళ్లీ వెనక్కి తీసుకున్నారు. ఈ క్రమంలోనే కొందరికి మంగళవారం, ఇంకొందరికి బుధవారం ప్రమోషన్ ఆర్డర్లు ఇచ్చారు. ప్రమోషన్లు పొందిన వారంతా బుధవారం కొత్తగా కేటాయించిన బడుల్లో చేరారు. మల్టీజోన్ 1 పరిధిలోని 19 జిల్లాల్లో మొత్తం ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 10,083 మంది ప్రమోషన్లు పొందారు. వీరిలో 4,910 మంది లాంగ్వేజీ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం) గా, 966 పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) గా ప్రమోషన్ ఆర్డర్లు ఇచ్చారు. మిగిలిన 4,207 మంది ఎస్జీటీలకు ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ గా, వివిధ సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్ ఇచ్చారు. కాగా, వారం రోజుల క్రితం మల్టీజోన్ 2 పరిధిలో లోకల్ బాడీ స్కూళ్లలో పనిచేస్తున్న 776 మంది స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా ప్రమోషన్లు లభించాయి. ప్రస్తుతం వారంతా కొత్త బడుల్లో విధుల్లో చేరారు. తొలిసారిగా ఆన్‌లైన్‌లో ప్రమోషన్ల ప్రక్రియఈ బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తొలిసారిగా ఆన్‌లైన్ లో నిర్వహించింది. చిన్నచిన్న లోపాలు మినహా.. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా సాగడంతో విద్యాశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, పోస్టు అప్‌గ్రేడ్ అయినా ప్రమోషన్లు రాని పండిట్, పీఈటీలను తాత్కాలికంగా ప్రస్తుతం ఉన్న పాఠశాలల్లో కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. వారికి రెండు, మూడు రోజుల్లోనే స్కూళ్లలో సర్దుబాటు చేయనున్నారు. ఒకటికన్నా ఎక్కువ సబ్జెక్టుల్లో ప్రమోషన్లు పొందిన వారి వివరాలనూ డీఈఓల నుంచి సేకరించి, మిగిలిన ఖాళీల్లో తర్వాతి ప్రమోషన్లు ఇవ్వాలనే యోచనలో అధికారులు ఉన్నారు.

### అభిమానిని చంపి.. భార్య ఫ్లాట్‌లో పూజలు

# నటుడు దర్శన్ నిర్వాకం



తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు సంబంధించిన సంచలన విషయాలను పోలీసులు వెలికితీస్తున్నారు. తాజాగా దర్శన్ వినియోగించిన లోఫర్స్ ఆయన భార్య విజయలక్ష్మి ఫ్లాట్ వద్ద గుర్తించారు. వీటినే హత్య సమయంలో అతడు వినియోగించాడు. వీటి రికవరీతో కేసులో కీలక ఆధారాలను పోలీసులు దక్కించుకొన్నట్లైంది. హత్య అనంతరం 9వ తేదీ తెల్లవారుజామున రేణుకాస్వామి మృతదేహాన్ని పారేసి హోస్కెరహల్లిలోని భార్య విజయలక్ష్మి ఫ్లాట్ కు దర్శన్ చేరుకొన్నాడు. అక్కడినుంచి మైసూర్ బయల్దేరే ముందు ఇంట్లో పూజలు చేశాడు. ఈ నేపథ్యంలో ఆమెకు కూడా పోలీసులు సమన్లు జారీ చేసి బుధవారం ఐదు గంటలపాటు విచారించారు. అంతేకాదు.. ఆ లోఫర్స్‌ను ఎవరైనా కడిగారేమోనని అడిగి తెలుసుకొన్నారు. ఈ హత్య అనంతరం కొన్ని దుస్తులు, ఫుట్‌వేర్‌ను దర్శన్ కాస్ట్యూమ్ అసిస్టెంట్ రాజు తెచ్చి విజయలక్ష్మికి ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఆమెను సాక్షిగా పోలీసులు భావించే అవకాశాలున్నాయి.

**దర్శన్ ఫ్యాన్ క్లబ్‌పై పోలీసుల కన్ను..**

రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్ ఫ్యాన్ క్లబ్‌లోని వారు కీలకపాత్ర పోషించడంతో.. ఇప్పుడు పోలీసుల కన్ను వారిపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా దర్శన్ ఫ్యాన్‌క్లబ్ కార్యకలాపాలపై దృష్టిసారించారు. వీరందరికీ దర్శన్‌తోపాటు అతడి దర్శక నిర్మాతల నుంచి ఆకర్షణీయమైన మొత్తాలు అందుతున్నట్లు గుర్తించారు.



## మోదీకి ఉద్ధవ్ థాక్రే సవాల్

మహారాష్ట్రలో ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పీఎం మోదీకి తనకు మధ్య పోరు నెలకొందని ఉద్ధవ్ థాక్రే అన్నారు. ఏక్‌నాథ్ షిండేను పక్కన పెట్టి ఎన్నికలకు సన్నద్ధం కావాలని సవాల్ చేశారు. శివసేన నిజమైన సింబల్(బాణం)ను వాడకుండా బీజేపీ ఎన్నికలు గెలవాలని పార్టీ అవిర్భావ వేడుకల్లో అన్నారు. మరోవైపు ఎన్డీయేలో చేరుతారనే ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. తమను అంతం చేయాలనుకున్న పార్టీతో చేరేది లేదని స్పష్టం చేశారు.

## ఇయర్ ఫోన్స్ అధికంగా వాడితే నష్టాలివే




కొందరు ఇయర్ ఫోన్స్ అధికంగా వాడుతుంటారు. దీని వల్ల అనేక నష్టాలున్నాయి. ఇయర్ ఫోన్స్ వాడకం ఎక్కువైతే చెవిలో పోటు, ఇరిటేషన్, ఇన్‌ఫెక్షన్స్ వంటి సమస్యలు తలెత్తుతున్నట్లు ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోజుకి ఎనిమిది గంటలకుపైగా హెడ్ ఫోన్స్ ఉపయోగించేవారిలో చెవులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. స్టెరిలైజ్ చేయని ఇయర్ పాడ్స్, ఇయర్ ప్లగ్స్ వల్ల ఇన్‌ఫెక్షన్ సులభంగా వ్యాపించే అవకాశం ఉందని చెబుతున్నారు.

### వెనక వైపు అసభ్యంగా

# తాకాడు..

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ ద్వారా తెలుగు వారికి దగ్గరయ్యింది అవికా గోర్. ఆ తర్వాత రాజ్ తరుణ్ సరసన ఉయ్యాలా జంపాల తో హీరోయిన్ గా వెండితెరకు పరిచయమైంది. ఈ హిట్ కావడంతో లక్ష్మీ రావే మా ఇంటికి, చూపిస్తా మావ, తను నేను, ఎక్కడికీ పోతావు చిన్నవాడా, రాజుగారి గది 3, పాప్ కార్న్ చిత్రాలతో మెప్పించింది ఈ ముద్దుగుమ్మ.అయితే తెలుగులో ఈ బ్యూటీకి అంతగా అవకాశాలు రాలేదు. చాలా కాలం తర్వాత వధువు అనే వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీలోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం హిందీలో బ్లడీ ఇష్క్ లో నటిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అవికా గోర్ ఓ ఈవెంట్లో తనకు ఎదురైన చేదు అనుభవాలను చెప్పుకొచ్చింది. అలా ఒక్కసారి కాకుండా రెండుసార్లు జరిగిందని తెలిపింది.తాను వేదికపైకి వెళ్లే సమయంలో ఓ వ్యక్తి వెనకవైపు అసభ్యంగా తాకాడని తెలిపింది. తిరిగి చూస్తే అక్కడ కేవలం తన బాడీగార్డ్ మాత్రమే ఉన్నారని.. అతడు సారీ చెప్పడంతో ఆ సంగతి వదిలేశానని తెలిపింది. ఇదే సంఘటన రెండోసారి కూడా జరిగిందని చెప్పుకొచ్చింది అవికా. కానీ ఈసారి తనను పట్టుకోకముందే బాడీగార్డ్ చేయి పట్టుకున్నాని అవికా తెలిపింది.



## అవును.. పరీక్షకు ముందురోజు రాత్రే నీట్ పేపర్ అందింది: అంగీకరించిన విద్యార్థులు

దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశపరీక్ష 2024'లో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు సమాచారం రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని తోసిపుచ్చింది. అయితే, పేపర్ లీక్ నిజమేనని తాజాగా బయటికొచ్చింది. ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం తమకు అందిందని బిహార్‌లో అరెస్టయిన కొందరు విద్యార్థులు పోలీసుల ఎదుట అంగీకరించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగానే ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్‌తో పాటు ముగ్గురు నీట్ అభ్యర్థులు కూడా ఉన్నారు. వీరిలో ఓ అభ్యర్థి జూనియర్ ఇంజినీర్‌కు స్వయానా మేనల్లుడు కావడం గమనార్హం.

"రాజస్థాన్‌లోని కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతున్న నాకు మామయ్య ఫోన్ చేశారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేశానని, ఇంటికి రమ్మని పిలిచారు. నీట్ పరీక్ష (మే 5) తేదీకి ఒక రోజు ముందు అంటే మే 4వ తేదీ రాత్రి నా స్నేహితులను తీసుకుని నేను మామయ్య వద్దకు వెళ్లాను. అక్కడ నాకు నీట్ ప్రశ్నపత్రం, ఆన్సర్ షీట్ ఇచ్చారు. రాత్రంతా వాటిని మేం బట్టీపట్టాం. మరుసటి రోజు పరీక్షా కేంద్రానికి వెళ్లిన తర్వాత ప్రశ్నపత్రాన్ని చూస్తే.. ముందు రోజు మామయ్య ఇచ్చిన పేపర్‌తో పూర్తిగా మ్యాచ్ అయ్యింది" అని ఆ నీట్ అభ్యర్థి పోలీసులకు వెల్లడించాడు. ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా రాసిచ్చాడు. దీంతో నీట్ అక్రమాల వ్యవహారం మరింత తీవ్రమైంది.

**హైకోర్టుల్లో విచారణపై సుప్రీం స్టే..**

మరోవైపు, నీట్ పరీక్షలో అవకతవకలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారణ




జరిపింది. ఈ వ్యవహారంపై పలు హైకోర్టుల్లో జరుగుతున్న విచారణలపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అన్ని పిటిషన్లను సుప్రీంకు బదిలీ చేయాలని జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ కోరడంతో ధర్మాసనం ఈ ఉత్తర్వులిచ్చింది. ఇదే సమయంలో నీట్ యూజీ 2024 పరీక్ష రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రం, ఎన్‌టీఏకు నోటీసులు జారీ చేసింది. అయితే నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆపేది లేదని న్యాయస్థానం పునరుద్ఘాటించింది.